శ్రీ కలువకొలను సదానంద

# మత్తకోకిల

వాల్ పోస్టరులోని వాళ్ళంటి కాదు.

పత్రికల కొట్ళలో వ్రేలాడుతున్న బూతుపత్రిక కూడా కాదు

వాటికంటే ఆకర్షణీయమైనది ప్రపంచంలో మరొకటుందా? ఉందనే అనుకోవాలి. లేకుంటే, కంటిమీద రెప్పవేయకుండా కుశలయ్య ఎందుకలా నిలబడిపోతాడు?

ఆ దివ్యసౌందర్యం ఏది?

అదే! ఆ రాతిబొమ్మ! ముసలాడి బొమ్మ!

రెండు నిలువుల ఎత్తున్న నల్లని శిలాపీఠం. దానిమీద చేయెత్తిన తెల్లని గాంధీవిగ్రహం. పాపంలాంటి, పాతకంలాంటి నల్లరాయి.దానిమీద పున్నెంలాంటి, పవిత్రతలాంటి తెల్లని గాంధీ!... రాముడి పాద స్పర్శతో రాతికి విమోచనం కలిగింది. ఓ నల్లరాయీ! నీ బ్రతుకు ధన్యమైంది. గాంధీ నీమీద పాదం మోపాడు. నీ నలుపంతా కరిగిపోవాలని నీమీద వెలసినాడు. నువ్వూ తెల్లగా మారిపో!

...మారిపోలేదు. నల్లరాయి నల్లగానే వుంది.

అయ్యో బాపూ! నల్లరాతిమీద నిలబడ్డావెందుకూ? నువ్వు కూడా నల్లబడిపోవూ ?

లేదు లేదు. గాంధీ తెల్లగానే వున్నాడు. కలగలిసిపోవటానికిదేమన్నా పాలూ నీళ్ళా? కిరాణా సరుకులా? ఇలా తలంమీద కాలూనడానికే చోటులేక, మహాత్ముణ్ణి ఆశ్రయించిన తెలుపు; మహాత్ముణ్ణి ఒక్కణ్ణిమాత్రం విడిచిపెట్టి దేశం నాలుగు దిక్కులనుండీ ఆ నల్లరాయిదాకా లావాలా పరచుకొన్న నలుపు.

కుశలయ్య రోడ్డుప్రక్కన నిలబడి ఒళ్ళంతా కళ్ళుచేసుకుని విగ్రహాన్ని చూస్తున్నాడు. నాలుగురోడ్ల కూడలిలో నిలబడ్డాడు గాంధీ. వీధిలో దొమ్మరాట చూడటానికి మదురుగోడ మీదికెక్కి కూర్చునే కుర్రాడిలా నల్లరాయిమీద నిలబడ్డాడు గాంధీ.

కుశలయ్యకు కన్నుల పండుగ్గా వుంది.

ఇందరు మనుష్యుల్లో గాంధీ ఒక్కడుమాత్రం విలక్షణంగా వున్నాడు!...అతని అలవాట్లూ విలక్షణమైనవే! బోడితల, బోసినోరు, మూరెడు గోచీ, మీద గావంచా, రొండిలోనుంచీ వ్రేలాడుతూన్న గడియారం, కుడిచేత పొడుగాటి ఊతకర్ర! పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ బిరబిరా నడిచిపోతున్నట్లున్నాడు.

లేక లేక పుట్టిన కొడుకును చంకనేసుకుని మురిసిపోతూ నిలబడ్డ కన్నతల్లిలా—జెండా గాంధీ ప్రక్కన నిలబడి సగర్వంగా రెపరెపలాడుతోంది.

పతాకధ్వజంనుండి రోడ్డు అవతలివైపున వున్న కరెంటు కంబానికి కట్టినమామిడాకుల తోరణంతెగిపోయి, నేలమీద విగ్రహం ముందర జారిపడి వుంది. శిలాపీఠం చుట్టూ సన్నని పూలసరాలు గొలుసులు గొలుసులుగా అలంకరింపబడ్డాయి. గాంధీ మెడలో కొండచిలువంత పెద్ద పూలదండ పాదాలదాకా వ్రేలాడుతూంది.

కుశలయ్యకు సూటిగా రోడ్డుకు అవతలివైపున నిలబడ్డ నల్లమేకకూడా గాంధీ విగ్రహంవైపు చూస్తూవుంది. విగ్రహం చుట్టూ నాలుగురోడ్లమీదా బస్సులు, లారీలు, కార్లూ బొయ్యిమంటూ దూసుకుపోతున్నాయి. నాలుగురోడ్లూ జాగ్రత్తగా దాటుకుంటూ ఒక చుట్టువేసి, అన్నివైపులనుంచీ విగ్రహాన్ని చూశాడు కుశలయ్య. విగ్రహం వెనుకవైపున నల్లరాతిమీద ఏవో తెల్లటి అక్షరాలు కనిపిస్తున్నాయి. ఆఅక్షరాలు స్పష్టంగా కనిపించడంలేదు. కుశలయ్య రోడ్డు దాటుకుని విగ్రహం దగ్గరకు వెళ్ళాడు. అంత ఎత్తయిన విగ్రహం నీడలో నిలుచున్న కుశలయ్య—తాతగారి కాళ్ళు పట్టుకుని లేచి నుంచున్న చంటివాడిలా కన్పిస్తున్నాడిప్పుడు.

ముందు నడిచిన మందతోబాటు వంకదాటే గొర్రెలాగా — దూరంగా రోడ్డు అంచున వున్న నల్లమేక కుశలయ్యను చూచి విగ్రహం దగ్గరకు నడిచివచ్చింది. నేలమీద పడివున్న మామిడాకుల్ని నమలసాగింది.

కుశలయ్యకు ముచ్చట వేసింది.

గాంధీ, తానూ, నల్లమేక !

నల్లమేకయితేనేం? తెల్లని పాలనిస్తుంది! గాంధీ మేకపాలు త్రాగి బ్రతికాడు. మేకపాలు మాత్రం తాను త్రాగి, మేక మాంసమంతా మనకిచ్చాడు. ఇప్పుడిది గాంధీగారి మేక! ఇక్కడి నుంచి వెళ్ళిపోయిన పిమ్మట—కసాయివాడి మేక !

కుశలయ్యకు తనివి తీరినట్లయింది.

హఠాత్తుగా తన ఎదుట మెరుపు మెరిసినట్లయి తలపైకెత్తాడు కుశలయ్య. షూటింగులో సినిమాతార తొడుక్కున్న నకిలీ ఆభరణాలు లైట్లలో జిగేల్‌మన్నట్లుగా — గాంధీ ప్రతిమ ఎదుట రోడ్డుకు అవతలవున్న దుకాణం తాలూకు రంగు రంగుల

విద్యుద్దీపాలు తళుక్కున వెలిగాయి. గాంధీనెత్తిమీది ఫ్లూడ్‌లైటు వెలవెలబోయింది.

''ఆత్మా లిక్కర్స్!'

అద్దాల బీరువాల్లోని రకరకాల సీసాలు బల్బుల్లా వెలుగు తున్నాయి. దుకాణం ముందర—రోడ్డు మీదికి కనిపించేలా మోల్డింగ్‌తో నిలువెత్తున తయారుచేసిన బొమ్మ ఒకటి అమర్చబడివుంది. ఒక గుండుమీద మూడు కోతులు కూర్చున్నాయి. ఒకటి కళ్ళు మూసుకుంది. ఒకటి చెవులు మూసుకుంది. ఒకటి నోరు మూసు కుంది.

'ఆత్మా లిక్కర్స్!'

కుశలయ్య ఆ దుకాణం దగ్గరకు వెళ్ళాడు. ఆ బొమ్మల్ని చూస్తూ నుంచున్నాడు అటు వైపున గాంధీ! ఇటు వైపున గాంధీగారి కోతులు! విశ్వరూప సందర్శనానంతరం దృష్టిరాహిత్యాన్ని ప్రసాదించమని భగవానుణ్ణి ప్రార్థించే ధృతరాష్ట్రుడిలా—కళ్ళూ, చెవులూ, నోరూ మూసుకున్నాయి కోతులు.

దుకాణం ముందర పేవ్‌మెంటుమీద బిచ్చగాళ్ళిద్దరు బట్ట పరచి, బైఠాయించారు. ఒకడు చక్కగా సినిమా పాటలు పాడు తున్నాడు. రెండోవాడు ఘటం వాయిస్తున్నాడు. హిరణ్యకశిపుడి కొలువులోని స్తుతి పాఠకులకు మల్లే—దాతలను అలరించగల పాటలే పాడుతున్నారు వాళ్ళు.

ఒక నాలుగు పాటలు విన్నాడు కుశలయ్య.

'పైకంతో కొనలేనిది ఏదీలేదు, నా మైకంలో పడనివారు ఎవరూలేరు...'

'నిషాలేని నాకు—హుషారేమి లేదు...'

'తాగితే తప్పేముంది? అఫ్‌కోర్స్, తాగితే తప్పేముంది?...'

'భూమ్మీద సుఖపడితే తప్పులేదురా—బులపాటం తీర్చుకుంటే తప్పులేదురా...'

గుడ్డమీద డబ్బులుకురుస్తున్నాయి. వ్యాపారదృష్టి లేకపోతే బిచ్చగాడు కూడా బ్రతకలేడు ఈ రోజుల్లో.

సీసాలు కలకలలాడుతున్నాయి· కిలకిలా నవ్వుతున్నాయి. గల గలా వాగుతున్నాయి. బాగ్దాద్ పురవీధుల్లో వేదికలమీద నిలబడ్డ అందగత్తెల్లా అమ్ముడుపోతున్నాయి.

రోడ్డు కూడలిలో పోలీసు నిలబడ్డాడు. అతను ట్రాఫిక్‌ను అదుపులో పెడుతున్నాడు. అటువైపున టీ కొట్టు, ఇటువైపున బ్రాందీషాపు—అతని కంటికి ఒకటిగానే వున్నాయి.

ఏడ్చేవాళ్ళను చూస్తే కొందరికి ఏడుపొస్తుంది. తాగు బోతుల్ని చూస్తుంటే, కుశలయ్యకు ఏదోమైకం కమ్ముతున్నట్లు యింది. వేదికమీది ప్రవక్తలా ఎత్తున నుంచున్న గాంధీ ముఖం వైపు చూశాడతను.

కదులుతున్న గాంధీ పెదవులు ఒక్క కుశలయ్యకే కనిపిం చాయి. 'పీనా బురా హై భాయీ!'

కోతులవైపు చూశాడు కుశలయ్య. మూడు కోతులూ ముమ్మూరు తప్పన్నాయి. అతనికి కోపం వచ్చింది.

గాంధీగారండోయ్! సినిమాల్లో చిత్తూరు నాగయ్యగారిలాగా ధర్మపన్నాలు వల్లించడమేనా నీ పని? ఉప్పు, కారం తిని బ్రతుకు తున్న మనుషులం—మాకు ఏది రుచిస్తుందో, ఏది రుచించదో—సన్యాసివి నీకేం తెలుసు? నీ మాటే వేదమా? ఆ మాటకొస్తే, వేదమంటే కూడా మాకు గౌరవంలేదు తెలుసా? నువ్వు చెప్పినట్లు విని, ఇంద్రియాలకు బిరడాలు బిగించి ముడుచుకు కూర్చోవటానికి మేమేం కోతులమా? మనుషులం మేము! డార్విన్ సిద్ధాంతం తెలుసా నీకు? కోతులనుండి పుట్టుకొచ్చిన మనుషులం మేము! మా చూపు ముందుకే! మా నడక ముందుకే! మమ్మల్ని వెనక్కు—మళ్ళీ కోతుల దగ్గరకు నడిపించకు! నిన్నక్కడ నుంచోబెటాం, నుంచో! నీ పూజా పునస్కారాలకు మాత్రం లోటు చెయ్యం!

కుశలయ్య అక్కడ నిలబడలేకపోయాడు. అక్కడినుంచి వెళ్ళిపోలేకపోయాడు. ఉండలేక, వెళ్ళిపోలేక మెల్లగా నడవసాగాడు. నల్లటిరోడ్డు! పొడుగాటి విస్కీ సీసాలాంటి రోడ్డు! సీసామీద విస్కీ బొట్టు జారి, ఆరిన చారవెంబడి నడిచే ఈగలా కదిలిపోతున్నాడు కుశలయ్య.

అతనికి గాంధీమీద జాలి పుట్టుకొచ్చింది. వేగంగా మలుపు తిరిగి అకస్మాత్తుగా ప్రత్యక్షమైన లారీకి సూటిగా పరుగెడుతోన్న కుర్రవాణ్ణి చూచినట్లు—లోకాన్ని చూచి గుండె గతుక్కుమంటోంది. తనమీద తనకే కోపంగా వుంది. లోకానికి ఏదో చెప్పాలని వుంది. ఏం చెప్పాలో, ఎలా చెప్పాలో స్పష్టంగా తెలియకుండా వుంది. సుఖంగా ప్రసవించలేక సుళ్ళు తిరిగిపోతున్న చూలాలికిమల్లే మూలిగే ఈ హృదయాన్ని—మత్తుమందు ఇచ్చి శాంతింపజేయాలని వుంది.

కుశలయ్య ఆగాడు.

'మాధురీ బ్రాందీ షాపు!'

పేవ్‌మెంటుమీద నిలబెట్టిన బోర్డు—'మీ ఆరోగ్యానికి సావరిన్ బ్రాందీ!'

ప్రక్కన హోటలు—'కోడిపలావు తయారు!'

కుశలయ్య వెనక్కు తిరిగి చూశాడు. దూరంగా గాంధీ ప్రతిమ కనబడుతూ వుంది. దుడ్డుకర్ర చేతబట్టుకుని పెద్ద పెద్ద అంగలు వేస్తున్నట్లున్న జాతిపిత—ప్రియుడివెంట లేచిపోతున్న కన్న కూతుర్ని తరుముకుంటున్న ముసలి తండ్రిలా వున్నాడు.

కుశలయ్య ముందుకు కదిలాడు.

గమ్యం చేరుకున్న కోరికలా ఆగాడు.

'మోహినీ బ్రాందీషాపు!'

అతను వెనుదిరిగి చూశాడు. మలుపులో మరుగుపడిపోయాడేమో—గాంధీ కనిపించడంలేదు. మోకాళ్ళు డోక్కుపోయిన ప్రభో. ధంలా వెనకబడిపోయాడు.

ఇక్కడ గాంధీలేదు!

శిష్యులారా, ఇదిగో అరటిపళ్ళు. ఎవరికంటా బడకుండా వీటిని తినిరండి.

ఆచార్యా, తిని వచ్చాం. ఎవ్వరికంటా పడకుండా తిన్నాం.

నేను గది తలుపు గొళ్ళెం పెట్టుకుతిన్నాను.

నేను గోడచాటున తిన్నాను.

నేను గొంగళి ముసుగేసుకు తిన్నాను.

నాయనలారా! ఎవ్వరూ చూడలేదంటారు; మరి దేవుడు చూడలేదా? మీరెక్కడున్నా, ఏం చేసినా వాడొక్కడు చూస్తాడు.

దేవుడు! గాంధీ దేవుడు కాదా? గాంధీ ఇప్పుడిక్కడ లేడా? ఉన్నాడు! ఈ వెలుతురులో ఉన్నాడు. ఆ చీకట్లో ఉన్నాడు. నీలో ఉన్నాడు. నాలో ఉన్నాడు. మన జేబుల్లో ఉన్నాడు. ఆ బ్రాందీ సీసాల్లో ఉన్నాడు. సర్వం గాంధీ!

కలలో కనిపించి కంసుణ్ణి కలతపెట్టే కృష్ణబాహుళ్యంలా బ్రాందీ సీసాలన్నిటిపైనా గాంధీ బోసినవ్వు! కుశలయ్య కళ్ళు నులుముకున్నాడు. గాంధీ మాయమైనాడు.

బ్రాందీదుకాణం ప్రక్కనే ఆధునికమైనహంగులతో క్రొత్తగా వెలసిన హోటల్ వుంది. 'అశోకా హోటల్—మాంసాహార భోజన శాల.' త్రాగుడు నీటికోసం వలస వచ్చిన ఒంటెల బారులా కార్లు వస్తున్నాయి. హోటల్ ముందర ఆగుతున్నాయి. రోడ్డు పొడుగునా మెర్క్యురీ దీపాలు పడుపుటింటి పరిచారికల్లా వరసగా నిలబడి, వచ్చే కార్లకు స్వాగతం చెబుతున్నాయి. కార్లు—నున్నటి రోడ్లు—మెర్క్యురీ దీపాలు—బ్రాందీ షాపులు—అన్ని వసతులూవున్న హోటళ్ళు—లాడ్జీలు—లాడ్జీలనిండా రంజైన రామచిలకలు – ఇదీ నీ దేశం!

ఎన్నో బోర్డులు! కప్పునుంచి వ్రేలాడుతున్నాయి కొన్ని. పేవ్‌మెంటుమీద నిలబడ్డాయి కొన్ని. వాటిలో ఒకటి – 'మీ ఆరోగ్యానికి సావరిన్ బ్రాందీ!'

దుకాణం ముందరికి వెళ్ళి నిలబడ్డాడు కుశలయ్య. అతని గుండె వేగంగా కొట్టుకోసాగింది.

'ఏం కావాలి?'

'గగ్గా గాంధీ!'

కొట్టువాడు తెల్లబోయాడు 'గాంధీనా?!'

కుశలయ్య సిగ్గుపడ్డాడు. తాను బద్ధుద్ధాయిననని ఒప్పుకుంటున్న వాడిలా చిరునవ్వు నవ్వుతూ 'గాంధీ కాదండీ; బ్రాందీ!' అన్నాడు.

కొట్టువాడు బల్లమీద సీసాలు పెట్టాడు. బిహ్హైవ్ బ్రాందీ, హాస్పిటల్ బ్రాందీ, బిస్కెట్ బ్రాందీ... వెలలు...

సావరిన్ బ్రాందీ లేదా?'

'ఉంది!'

'ఎంత ?'

'ఆరు రూపాయలు.'

'అదే యివ్వు.'

కుశలయ్య డబ్బిచ్చి సీసా అందుకున్నాడు.

రాకుమారుడి రథంలాగా రుయ్యిమంటూ వచ్చి ఆగిందొక కారు. కారు ఆగడం, తలుపులు తెరుచుకోవడం రెండూ ఒక్కసారే జరిగాయి. గంధమాదన పర్వతంమీద వాలిన గంధర్వ కుమారుల్లాగా నలుగురు యువకులు—విద్యార్థులేమో—నేలమీద కాలు మోపారు. వేషభాషల్లో దేశద్రిమ్మరుల్లా వున్నారు వాళ్ళు. దేశద్రిమ్మరులకు నాజూకైన పేరు—హిప్పీలు! ఇంకా సీసాలైనా కొనకుండానే తాగుబోతుల్లా తూలిపోతున్నారు.

ఆ నలుగురూ సీసాలు కొనుక్కున్నారు. అశోకాలోకి నడిచారు. కుశలయ్య వాళ్ళను అనుసరించాడు.

స్వర్గానికి చేరువగా – తక్కిన మనుషులకంటే దగ్గరగా—పై అంతస్తున ఆరుబయట—చుక్కల చాందినీక్రింద విడిది చేశారు వాళ్ళు. మద్యంలో తాదాత్మ్యం పొందినవాళ్ళు రోడ్డుమీదికి బోల్తా పడకుండా వుండేందుకు చుట్టూ రెండేసి పిట్టగోడలు – ఫ్లాస్కులోపలి గాజుగోడల్లా—కట్టిఉన్నారు. కుశలయ్య ఒక వారగా బల్లముందరకుర్చీలో కూర్చున్నాడు.

'ఏం కావాలి సార్ ?' అన్నాడు కుర్రాడు.

'కాస్సేపు ఆగు.'

'హిప్పీ'ల వైపే చూస్తూ కూర్చున్నాడతను. ఓహో! క్రమంగా బోధపడుతోంది. సోడా తెప్పించు. అదీ యిదీ గ్లాసులో కలగలుపు. ఒక్క దమ్మున గడగడా త్రాగేయి. ఆపైన—బల్లమీద కోడిపలావు!...పగలబడినవ్వు! బూతులు బనాయించి చమక్కులు విసురు! సోడాబుడ్లకు మల్లే కిసుక్కుమంటారందరూ! కముజు పిట్టల్లా కెకెకే అంటారు. చీర వూడిపోయిన నీ సంస్కారాన్నీ, ఔన్నత్యాన్నీ, నాగరికతను నగ్నంగాచూచి భేష్ అంటారు.

గొప్పవాళ్ళ గారాబు బిడ్డలు!

చిట్టి తండ్రులారా! పారిశ్రామిక వేత్తలుగానో, ప్రజాసారధులుగానో రేపు ఈ జాతికి ప్రాతినిధ్యం వహించబోతున్నవాళ్ళు మీరు. తాగుతున్నారా బాబూ? గాంధీగారి పేరు విన్నారా మీరు? మీలాగా శ్రీమంతుల యింట్లోనే పుట్టాడాయన. ఆయన కూడా తాగాడుగానీ, మీరు తాగుతున్న ఎర్రటి నీళ్ళుకాదు. తెల్లటి మేక

పాలు తాగాడాయన. మీలాగా హిప్పీ క్రాపులు పెంచుకోలేదాయన. వంగితే పుసుక్కున జారిపోయే గొట్టం పంట్లాములు తొడుక్కోలేదు. సామాన్యుడికిమల్లే గోచీకట్టుకున్నాడు. మీరు గాంధీకంటే గొప్పవాళ్ళా తండ్రీ? నేనూ తాగుతున్నాను చూడండి. నా కోసం కాదు, మీకోసం! మీలాంటివాళ్ళ కోసం! ఇందులో మీరు పొందుతున్న ఆనందమేమిటో స్వయంగా తెలుసుకుని ఏడవటం కోసం! నామాట మీరు వినితీరాలి. ఎందుకంటే — దేశానికి పనికొచ్చేవాళ్ళు మీరు. మీరు భ్రష్టులైపోతే దేశం చచ్చిపోయినట్లే! అభిమానధనుడు యితరుల సొమ్ము చిల్లిగవ్వయినా వాడుకోడు. మంచినీళ్లకు మల్లే మీరు పారబోస్తున్న డబ్బు మీదికాదు. మీ పెద్దలది. వాళ్ళు చెమటోడ్చి సంపాదించిన సొమ్ము! చెమటోడ్చిన వాళ్ళ నోళ్ళుకొట్టి సంపాదించిన సొమ్ము! ఆ పాప-పుణ్యాలకు వారసులమని చెప్పకోవటానికి మీకు సిగ్గు లేదూ?

గ్లాసు నోటబెట్టుకున్నాడు కుశలయ్య. కుళ్ళిన శవంమీది నుండి ఎగిరివచ్చే దుర్గంధంలా — అతని ముఖంలో వెగటు సుళ్ళు తిరిగింది. ఆత్మహత్య చేసుకుంటున్న వాడిలా బలవంతంగా మింగాడు. చేదుగా వుంది — వేపనూనెలాగా! వేపనూనె ఆరోగ్యానికి మంచిది. వేపనూనె; సారాయి! ఇల్లాలు; ప్రియురాలు! ఇద్దరూ ఆడవాళ్ళే! ఇల్లాలు ప్రేమిస్తుంది; ప్రాణమిస్తుంది! ప్రియురాలు కామిస్తుంది; గెంటేస్తుంది! అయినా, మగవాళ్ళకు పెళ్ళాలకంటే ప్రియురాండ్రంటేనే ఎక్కువ మోజు!

మంటపుట్టి, గొంతు కరకరలాడింది. చింతనిప్పులు మింగినట్లుగా వుంది. హాలాహలాన్ని ఎలా మింగగలిగాడు శివుడు? బహుశా అది యింత ఘాటుగ వుండదేమో!

పళ్ళెంలో వున్నదేదో తింటున్నాడు కుశలయ్య. కల్లబొల్లి మాటలతో కన్నెపిల్లను లొంగదీసుకుంటున్న కుటిలుడిలా — మత్తు అతన్ని అంచెలంచెలుగా ఆక్రమించుకుంటోంది. కోరికల పడవనెక్కి చంకనున్న చంటిపాపను మరచిపోయినభర్త ప్రవిహీనలా — కనురెప్పలు కంటిపాపకు దూరమైనాయి. చేతులు గురితప్పుతున్నాయి.

మత్తు!

కుశలయ్య బిల్లు చెల్లించి పైకి లేచాడు. సముద్రంమీద తేలియాడే తెప్పలాగా కాళ్ళక్రింద నేల, మిణుగురు పురుగుల్లాగా చీకటి నిండా పొదిగిన దీపాలు — ఉయ్యాల లూగుతున్నాయి. పాములాంటి ఫూట్ రోడ్డుమీద మలుపులు తిరుగుతూ పోయే బస్సులో పట్టు దొరక్క నిలబడ్డ ప్రయాణీకుడిలా — ముందుకు తూలాడు అతను.

'బుడ్డీ మరిచిపోతున్నారు సార్!' అన్నాడు కుర్రాడు.

'ఎందుకదీ?'

'అందులో యింకా కొంచెం వుందండీ!'

'అలవాటుందా నీకు?'

'బొగ్గులుమోసేవాడికి తలమసిగాకుండా వుంటుందాసార్?' అంటూ యికిలించాడు కుర్రాడు.

'అయితే ఆ బుడ్డీ నువ్వే వుంచుకో!' అన్నాడు కుశలయ్య — భోగం మేళానికి భూరి విరాళమిచ్చే సంస్థానాధీశుడిలా!

తన సంతృప్తిని మాటల్లో వెలిబుచ్చాడు కుర్రాడు. 'మీలాంటోళ్ళు అరుదుగా గానీ రారు సార్! కోడి పలావైనా వొదిలేసి వెళ్ళిపోతారుగానీ, బుడ్డీలో బ్రాందీ మిగలబెట్టి పోయేవాళ్ళను మిమ్మల్నొక్కర్ని చూస్తున్నాను. వాళ్ళంతా తాగుబోతులండీ!'

ఆ ప్రశంసతో కుశలయ్య మత్తు మరొక మోతాదు హెచ్చింది. వాడికి మరో సీసా కొని యివ్వాలనిపించింది. వాడు మళ్ళీ పొగిడితే మరో సీసా యివ్వవలసి వస్తుంది గదా? దానికి అంతెక్కడ? మహామహా పొగిడాళ్ళే మొలమీద గుడ్డతో మిగిలిపోయారు — కారణం? పొగడ్తలతో పాచికలాడి!

జారిపోయే కొరమీనును వాటంగా పట్టుకున్నట్లు — శరీరాన్ని అదుపులోపెట్టుకుంటూ జాగ్రత్తగా క్రిందికిదిగివచ్చాడు కుశలయ్య.

మోహినీ బ్రాందీషాపు!...రాక్షసులవంతు వచ్చేసరికి అమృతం అయిపోయిందంటూ కుండ బద్దలు గొట్టింది మోహిని. బ్రాందీ కొట్టు మోహిని — అన్నపూర్ణ! కామధేనువు! కల్పతరువు! కుండ క్రిందికి దించదు. అది జీవధార!

పోలీసు ఎదురుపడ్డాడు.

కుశలయ్య చిరునవ్వు నవ్వాడు. పోలీసూ నవ్వాడు.

'ఏం సంగతి?' అన్నాడు కుశలయ్య.

'ఏముందీ?' అన్నాడు పోలీసు.

నడుస్తున్నాడతను — సుళ్ళు తిరిగే కాగితపు పడవలాగా! సుడిగాలిలో చిక్కుకున్న గాలిపటంలాగా! నున్నటిరోడ్డు — రాజుగారు నడవటం కోసం పరచిన తివాచీలాంటి రోడ్డు — గాలిపటంతోకలా, గాలికెగిరే రిబ్బనులా కదులుతోందిప్పుడు. కెలీడోస్కోపులోని గాజుపూసల్లాగా విద్యుద్దీపాలు చిత్ర విచిత్రంగా బృందనాట్యం చేస్తున్నాయి. కొత్తకారు మీదపడి సాగిపోతూ, వంగిపోతూ, జారిపోయే ప్రతిబింబాలకు మల్లే కనిపిస్తున్నారు — రోడ్డుమీది మనుషులు. రోడ్డు, దుకాణాలు, దీపాలు, మనుషులు, వాహనాలు ... రబ్బరు బుడగమీద అచ్చువేసిన బొమ్మలాగా వుంది! కోణాలు, దూరాలు, కొలతలు పాటించకుండా చిన్నపిల్లలు గీసిన చిత్తరువులాగా వుంది! రంగుటద్దాలు తీసివేసిచూస్తున్న త్రీడీపిక్చరులాగా వుంది ప్రపంచం!

కుశలయ్య మలుపు తిరిగాడు.

ఒక కొమ్మలో చింతకాయలు రాల్చి పక్క కొమ్మమీదికి దాటుకునేవాళ్ళలాగా — పాట పాడుతున్న బిచ్చగాళ్ళు మాధురీ బ్రాందీషాపు వద్ద కనిపించారు.

దూరంగా నాలుగు రోడ్ల కూడలిలో — ఎవరది? ఎవరా భువనైక సుందరి? ఇంకెవరు? మోహిని! భుజంమీది అమృత భాండం బరువుగా వుందేమో — కందిరీగ నడుము కలువకాడలా వంగింది. కళ్ళలో కైపులాంటి పిలుపు! పెదవుల మీద మధువు లాంటి చిరునవ్వు! వంచి పట్టుకున్న అమృతభాండంలోంచి కుండ పోతగా దూకుతోంది అమృతం! శివుడి నెత్తినదూకి, అక్కడి నుంచి నేలమీదికి జారిన భాగీరథిలాగా—తలుపులు నెట్టుకుని పంట కాలువలోకి దొర్లే నదీ ప్రవాహంలాగా — ఆ అమృతధార నాలుగు రోడ్లనూపట్టుకుని నాలుగు దిక్కులకూ పారలిపారుతోంది. ఊరు ఊరంతా మునిగిపోయింది. సాగరగర్భంలోని పగడాల దీవిలా—మునిగి పోయిన ఊరు మైకంగా నిద్రపోతోంది.

అలలపై ఈదులాడే చిన్నారి చేపపిల్లలా తేలియాడుతూ నాలుగురోడ్ల కూడలివద్దకు వచ్చాడు కుశలయ్య. కురుస్తున్న అమృతధార చప్పున ఆగిపోయి, గాంధీగారి ఊతకర్రగా మారిపోయింది. ఇందాకా తాగండంటూ నుంచున్న మోహిని — ఇప్పుడు, తాగకు అంటూ కర్ర ఝుళిపించే గాంధీగా మారిపోయింది. మరణ దండన విధించబోయే నీతిపతివైపు చూస్తూ నోరాడక నిలబడి పోయే నేరస్తుడిలా స్తంభించిపోయాడు కుశలయ్య. రద్దీ తగ్గిపోగా నాలుగురోడ్లూ తీరిక దొరికిన నర్సుల్లా కునుకు తీస్తున్నాయి.

రోడ్డుకు అడ్డంగా నడిచివెళ్ళి, గాంధీప్రతిమ ముందర సోపానాలమీద—మార్కండేయుడిలా వాలిపోయాడు కుశలయ్య. బోనులో చిక్కుకుని దారికోసం గిరికీలుకొట్టే ఎలుక పిల్లలా— అతని గొంతులో మాటలు విలవిల్లాడాయి. అతను రెండుచేతులూ పైకి చాపాడు. భూమిని చీల్చుకొంటూ పైకి చిమ్ముకొచ్చే జల ధారలాగా అతనిగొంతు పెగిలింది.

'బాపూ!'

నాలుగురోడ్లూ ఉలికిపడ్డాయి. 'ఆత్మాలిక్కర్స్'లోని సీసాల దొంతర లోకాంతర స్వరంలా ప్రతిధ్వనించింది.

అతని హృదయంలో ప్రాణం పోసుకున్న భావాలు—చీకి పాదలో దూరి కోకలు చింపుకున్న సుందరీమణుల్లా — మొండిబారిపోయిన అతని నాలుకమీదినుంచి బయట పడసాగాయి. కోకలు చిరిగితేనేమి? భావాలు చెక్కు చెదరలేదు.

'బాపూ! నన్ను మన్నించు! నువ్వేమో తాగవద్దన్నావు. నీ మాటమీదనే నడిచాను. కానీ ఏం చేయను? ఈ ప్రభుత్వం నన్ను తాగమంటోంది. తాగుతుంటే తరుముకోవద్దని పహారావాళ్ళకు ఫర్మానాలిచ్చింది. నేనూ, నా సోదరులూ—ప్రభుత్వం నడపండని పదిమందిని పంకా కిందికి పంపితే, వాళ్ళేం చేశారూ? ... మేమేం చెప్పినా, మేమేం చేసినా అది ప్రజాభిప్రాయమేగదా! మద్యపానమే తారకమంత్రం పొండి—అన్నారు. ఏరి కోరి కట్టుకున్న పెళ్ళాం మొగుణ్ణి మొట్టికాయవేస్తే మిఠాయిలా ఉందనాలి! గత్యంతరం లేదు. నేను చాలా దుర్బలుణ్ణి! ప్రలోభానికి లొంగిపోయి పాపం రుచి మూశాను. కత్తి పట్టుకున్న కసాయివాడివైపు చూచే మేక పోతులా—నా వైపు అలా చూడకు మహాత్మా! రాజధానివైపు చూడు! కుడిచేతనున్న ఊతకర్రను ఎడమ చేతిలోకి మార్చుకుని, ముక్కున వేలేసుకుని చూడు!...'

నాయనా!

కుశలూ!

'ఎవరు? ఎవరిదా పిలుపు? నన్ను పేరెట్టి పిలుస్తున్న దెవరు?'

నేనే తండ్రీ! తల పైకెత్తి చూడు!

కుశలయ్య లేచి నిలబడ్డాడు. అతనిముఖం గుమ్మడి పువ్వులా విచ్చుకుంది. 'నువ్వా బాపూ! నమోన్నమః నీ దర్శన భాగ్యంతో నా జన్మ తరించింది! ధన్యోస్మి!'

...నీ తప్పేమీలేదు కుశలూ!

'చాలు! ఆ మాట చాలు! ఇక తాగను!'

ప్రభుత్వానిది కూడా తప్పకాదు. ప్రభుత్వాన్ని పల్లెత్తు మాటన్నా పాపం చుట్టుకుంటుంది. ఘోరనరకంలో పడిపోతావు సుమా!

'మహాత్మా! నువ్వేనా యిలా అంటున్నావు? నువ్వు ప్రజల మనిషివి కావా?'

ప్రజల మనిషినే! అయితే ప్రజల తప్పుల్ని పానకంలా తాగి భేష్ అనమంటావా? భలేవాడివే! తాగడం తప్పని ప్రజలకంటే ప్రభుత్వానికే బాగా తెలుసు! తాగుడు మానండి మొర్రోమంటూ నెత్తిన చేతులు పెట్టుకుని కుయ్యోడ్డాయి ప్రభుత్వాలు. మద్య పానాన్ని నిషేధించినప్పుడు చట్టబద్ధంగా నడుచుకున్నారా ప్రజలు? దొంగచాటుగా బట్టీలు పెట్టారు. ప్రజల దాగుడుమూత తెలాంటివో విను! ప్రభుత్వం లిక్కర్‌ను కంట్రోలుచేస్తే ప్రజలు టించర్లు వాడతారు. టించర్లను కంట్రోలు చేస్తే కృతకమైన స్పిరిట్ల మీదికీ, కాఫీకి పాలు అవసరం గనుక నీళ్ళ పాలైనా కొనకతప్పనట్లు ఆ స్పిరిట్‌లకోసం ఫ్రెంచి పాలిష్, వార్నిష్ మొదలైన వాటిమీదికి ఎగబడతారు. స్పిరిట్లను అదుపు చేశారుపో, యుడికొలోన్ నీళ్ళ వాడకం ప్రారంభమవుతుంది. కొలోన్ నీళ్ళను కంట్రోల్‌లో పెడితే ఎసెన్సులూ, సుగంధ ఆల్కాహోలూ వాడతారు. ఏడాది పొడుగునా అసలైన సారాయి అతిగా తాగి వెయ్యమంది చస్తే, ఈ మిశ్రణ ద్రావకాలవల్ల ఒక్కనెలలోనే రెండువేలమంది చస్తారు. కన్న తల్లిదండ్రులు కడుపున పుట్టిన బిడ్డల్ని చంపుకుంటారా? ఇలాంటి అకాల మరణాలను అరికట్టడం ప్రభుత్వంయొక్క ప్రధాన ధర్మం కాదా? నీ ఆరోగ్యంకోసం ఇక బాహాటంగా తాగు! నీ ప్రభుత్వం పేరు చెప్పుకుని మరీతాగు!

కుశలయ్య వెనక్కు రెండడుగులు నడిచి, మేడగది కిటికీ లోని తైలాను పిలిచే మజ్నూలా నిలబడ్డాడు. 'మహాత్మా! తాగ

మంటున్నావా? రోడ్డుమీద తప్పటడుగులు వేస్తున్న నన్నుచూడు, డేగలా నన్ను తన్నుకుపోలేక వెంట్రుకంత తేడాతో దూసుకుపోయిన ఆ లారీని—అందులోని డ్రైవర్నిచూడు! ఇద్దరిలోనూ ఒకేమత్తు. మనుష్యుల్ని లారీల కిందికి పడదోసే సారాయినా తాగమంటావు? పండ్లు, కాయలు, ఆకులతో నింపుకోవలసిన పొట్టకు — పాలు, మజ్జిగ, మంచినీళ్లతో తడుపుకోవలసిన పేగులకు సారా పోయమంటావా? నా ఆరోగ్యం కోసం తాగమంటావా? తాగితే ఆరోగ్యం అధోగతి పాలౌతుందని — లా చదువుకున్న నువ్వేకాదు, మెడిసిన్ చదువుకున్న డాక్టర్లు కూడా చెప్పారుకదా? ఈ మహమ్మారి మనుషుల నెత్తురుతాగి, ఎముకల్ని నమిలి వుమిసేసి, అంతటితోనైనా తృప్తిపడి వెళ్ళిపోతుందా? బుద్ధినీ, నీతినీ, మానవతను శుభ్రంగా నాకేసి, సమాజాన్ని, దేశాన్ని, ప్రపంచాన్నీ ఎడారిగా చెయ్యనిదే నిద్రపోదు. మతిచాంచల్యం, అనారోగ్యం, విడిపోవడాలు, నేరాలు, సాంసారిక దుఃఖాలు, ఆర్థిక బాధలు, మతిమరుపు, రోడ్డు ప్రమాదాలు, యంత్రాలకూ, పరిశ్రమలకూ, వస్తూత్పత్తికీ వాటిల్లే తీవ్రనష్టాలు — ఇవంతా సారాయియొక్క ప్రభావమేకదా? తాగటానికి కూర్చున్న బ్రహ్మరాక్షసికిమల్లే — ఈ త్రాగుడు మానవ జీవితాల్ని పెద్ద పెద్ద మోతాదుల్లో దిగమింగలేదా? తాగుబోతు పెళ్ళాం నూతిలో దూకదూ? తాడు ముడేసుకుని దూలానికి వేలాడదూ? తాగుబోతు బిడ్డలు బడుద్ధాయిలై, బిచ్చగాళ్ళై, దొంగలై, భ్రష్టులై పోరూ? తాచుపాము కాలిమీద కాటువేస్తే, నోట్లో ఎందుకు నురగలొస్తాయి? చచ్చిపోయినవాడు నోటితోకదా ఎండ్రిన్ తాగాడు! వాడి ఒళ్ళంతా ఎందుకు నల్లబడిపోయింది? విషం! మత్తుమందుకు మరో పేరు విషం! నాలుకపైనుంచీ గొంతులోకి జారి అక్కడే ఆగిపోవటానికి — అది వాసుకి కక్కిన హాలాహలంకాదు. వ్యామోహం కక్కిన విషం! నీ పేగుల్నీ, నీ గుండెను, నీ మూత్రపిండాల్ని — కాల్చేస్తుంది, మాడ్చేస్తుంది, మసిలా రాల్చేస్తుంది. ప్రపంచాన్నే జయించగలిగిన మహావీరులను కూడా పాదాలతో రాచిపారేసింది ఈ త్రాగుడు. అలెగ్జాండరు మరణానికి కారణం అతిత్రాగుడు. బర్గండీ వైన్ మోతాదుకు మించి తాగి, నెపోలియన్ వాటర్లూవద్ద — పోయాడు. మామూలు మనుషుల్నే కాదు, మహా సామ్రాజ్యాలను కూడా తుడిచిపెట్టేసింది ఈ క్షుద్రశక్తి! మొదటిప్రపంచ యుద్ధంలో ప్రపంచాన్ని బెంబేలెత్తించిన జర్మనీ—పక్షవాతం వచ్చిన మనిషిలా—అనుకోకుండా పతనమైపోవటానికి కారణం ఏది? కేవలం ఫ్రెంచి వైన్! దానిపట్ల జర్మన్ సైనికుల మోహం! మహాత్మా! తాతకు దగ్గులు నేర్పినట్లు—నీయంతటి వాడికి నేనివన్నీ చెప్పాలా? అన్నీ తెలిసినవాడివి—యీ తరంలో పుట్టి పెరుగుతున్నవాడిలా — తాగమంటావా? తాగితే తప్పు లేదంటావా?'

కుశలూ! నువ్వు పట్టి భౌతికవాదిలా వున్నావు నాయనా...

'అదేమో నాకు తెలియదు. నేను నైతికవాదిని! మానవతావాదిని!'

అది కూడా భౌతికమేనర్రా! నీతి నియమాలనేవి మనిషికి సంకెళ్ళ లాంటివి. నీకొక కిటుకు చెబుతున్నాను. నిజానికి ఈ సంకెళ్ళు భౌతికవాదంలోనూ వున్నాయి, ఆధ్యాత్మిక వాదంలోనూ వున్నాయి. ఆధ్యాత్మికవాదం వేసిన సంకెళ్ళను భౌతిక దృష్టితోను, భౌతికవాదం వేసిన సంకెళ్ళను ఆధ్యాత్మిక దృష్టితోను సడలించుకు తిరుగువాడు ధన్యుడు తండ్రీ! దీన్ని నువ్వు మెట్టవేదాంతమన్నా నాకు పోయిందేమీలేదు. ఇక విను! జాతస్య మరణం ధృవం! చావుకు కారణం ఒక్క త్రాగుడేనా? నేనెలా చచ్చాను? అబ్రహాం లింకన్ ఎలా చచ్చాడు? సాక్రటీస్ ఎలా చచ్చాడు? ఏసుక్రీస్తు ఎలా అవతారం చాలించాడు? మేమందరం తాగి చచ్చామంటావా? చావుకు కారణం ఒక్కటే! పుట్టుక! తనువు శాశ్వతం కానప్పుడు—నాబళ్ళు, నా యిల్లు, నా వాళ్ళు అంటూ మడిగట్టుకు కూర్చోవడం మూర్ఖత్వంకాదూ? వెధవ త్రాగుడును గురించి ఎందుకీ కంఠశోష? సాంఘిక సమస్యలెన్నో వుండగా, గోరంత మద్యపానాన్ని కొండంతగా ఊహించి భయపడిపోతావెందుకూ? త్రాగుడు కేవలం వ్యక్తిగతమైన విషయం. ఎవడికి యిష్టమైనది వాడు తాగుతాడు. నీ కిష్టమైతే మేకపాలు తాగు, ఇష్టం లేకపోతే సారా తాగు. నన్ను వద్దనటానికి నువ్వెవరు, నిన్ను వద్దనటానికి నేనెవరు? చట్టాన్ని గౌరవించడమే పౌరధర్మం నాయనా! చట్టం మద్యనిషేధాన్ని రద్దుచేసిన పిదప, తాగితే నేరం కాదు.

'ఆహా! ప్రజల వ్యక్తిగత విషయాల్లో జోక్యం పెట్టుకోవడం తగని పనిగా భావించిందంటావా ప్రభుత్వం? అందుకే మద్యనిషేధాన్ని ఉపసంహరించుకొన్నదంటావా? మద్యపానం నేరం కాదంటావా? తప్పదియ్యా, నువ్వు తప్పు మాటన్నా అది ఒప్పై కూర్చుంటోంది గదా? సరే, నీ మాటకే వస్తున్నాను; త్రాగుడు మానవుడి స్వంత విషయం!... ఒకడున్నాడు. చచ్చేదాక చెయ్యి విడువనంటూ దారిద్ర్యం వాణ్ణి వరించింది. పెళ్ళాం పిల్లలతో పరువుగా బ్రతకలేడు. పదిమందిలో తలెత్తుకుని తిరగలేడు. అది వాడి వ్యక్తిగత సమస్య. వాడి బాధలు వాడివే! ఒకడి బాధల్ని పంచుకోవలసినంత గ్రహపాటు సమాజానికి లేదుకదా! వాడి సమస్యలన్నిటికీ ఒకటే పరిష్కారమార్గం! చావు! వాడు చస్తే సమాజానికి నష్టంలేదు. మరైతే—వాడు మింగిన విషాన్ని కక్కించి, వాడిమీద కేసు నమోదు చేసుకుంటావెందుకూ? ఆత్మహత్యా ప్రయత్నం నేరమంటావా?...ఒక స్త్రీ! నమ్ముకున్న మగవాడు నట్టేట ముంచిపోయాడేమో! కష్టపడి బతుకుదామంటే కూలీ గిట్టలేదేమో! ఆమెకు కూడు కావాలి. గుడ్డ కావాలి. అది ఆమె వ్యక్తిగత సమస్య. ఆ సమస్య తనదిగా గుర్తించదు సమాజం. ఆమె వ్యభిచరిస్తుంది. ఒకడికి త్రాగుడు యిష్టం, మరొకడికి వ్యభిచారం యిష్టం. అలాంటి వాడితో ఆమె వ్యభిచరిస్తుంది. మన సొమ్మేంపోయింది? పొదరింట్లోని పక్షి మైథునాన్ని భంగపరిచే వేటగాడిలా ఆమెను పట్టుకుని కమ్ముల సందుల్లోకి తోస్తావెందుకు? వ్యభిచారం నేరమంటావా?...కన్నెపిల్ల! కక్కుర్తిపడి తప్పులో కాలు

పంచుకుంది. బ్రతుకు బండలు కాదనుకొంది. మోసపోయింది! కన్నీళ్ళకు కరువు లేదన్నట్లు కడుపు చెరువైంది. వెక్కిరించటానికి సాకు ఎప్పుడు దొరుకుతుందా అని వేచి చూచే ఈ లోకంలో ఏముఖం పెట్టుకు తిరగాలి? పరువే ప్రాణమనుకొని బ్రతుకుతున్న కన్నవాళ్ళు ఏ గంగలో దూకాలి? కన్నెరికం దోచుకున్నవాడు కడుపులో నాటిపోయిన కానుకను ఏ మూకుడుతో మూసిపెట్టాలి? ఆమె తన కడుపు చించుకుంటే మనకేల బాధ? అది ఆమె వ్యక్తిగత సమస్య గాదా? కుప్పతొట్టిలో నాలుగు నెలల గుడ్డు కనిపించిందని ఆమెను వెతికి పట్టుకుని బోనులో నిలబెడతావెందుకూ? భ్రూణహత్య నేరమంటావా? ఆత్మహత్యా ప్రయత్నం నేరం! వ్యభిచారం నేరం! భ్రూణహత్య నేరం! ఈమూడు నేరాలకు కారణాలు కనుక్కున్నావా? ఆ కారణాల్లో మద్యపానం కూడా ఒకటని తెలుసా? ఆ మూడు నేరాలకంటే పెద్దనేరం మద్యపానం! అయితే మద్యపానం నేరంకాదు! భళా భళి! మద్యపానం చేసుకున్న పుణ్యమేమి? తక్కిన నేరాలు చేసుకున్న పాపమేమి? ఒక్క మద్యపానంపట్ల మాత్రం ఎందుకీ ఆశ్రిత పక్షపాతం? మద్యపానాన్ని సమ్మతించిన చట్టం ఆత్మహత్యను, వ్యభిచారాన్ని, భ్రూణహత్యను, శిశుహత్యను ఎందుకు సమ్మతించకూడదు? ఎందుకని నేనడుగుతున్నాను.'

ఓహో! ఇది మరీబాగుంది! ఇంట్లో ఎలకలున్నాయని, ఇల్లు తగలబెట్టుకుంటారా ఎవరైనా?

'ఆ మాటే నేనంటున్నాను. ఎలుకల్నిమాత్రం ఏరి పారెయ్యాలి. ఎలుకలబోను పెట్టాలి. పిల్లిని పెంచాలి. పిల్లీ ఎలకా లాలూచీ పడితే, పిల్లిని దండించాలి. ఇల్లు తగలబెట్టుకుంటారా ఎవరైనా?'

మైకుముందర నుంచున్న హరిదాసు కంఠంలా—కుశలయ్య గొంతు గింగురుమంటోంది. నాలుగురోడ్లూ హరిభక్తులకుమల్లే ఒళ్ళంతా చెవులు చేసుకుని వింటున్నాయి. బ్రాందీషాపు ముందర కదిలిపోతున్నవాళ్ళు, హోటల్‌లోను, టీకొట్టులోను కూర్చున్నవాళ్ళు, కూడలి దగ్గర రోడ్డుప్రక్కన నుంచున్నవాళ్ళు—గారడీ వాడి చుట్టూ మూగి చప్పట్లుకొట్టే కుర్రవాళ్ళలా—భేష్ అంటూ, సెభాష్ అంటూ, వహ్వా అంటూ కుశలయ్యకు హుషారిస్తూ, వినోదం తిలకిస్తున్నారు.

'ఉలకనంటావేం మహాత్మా? నామీద కోపం వచ్చిందా?... నా ప్రబోధాలమీద జాతికే గౌరవం లేదు. ఈ కుశలయ్యకుమాత్రం ఎందుకుంటుంది? బుద్ధిగా కూర్చుని ఊ కొట్టకుండా, మాటకు మాట విసురుతూ, పదవి దొరకని పార్లమెంటు మెంబరులా వాదులాటకు దిగాడు; తాగుబోతు వెధవ! వీడితో ఎందుకొచ్చినగోల? నిద్రచేటు!...అనుకుంటూ పక్కసర్దుకుంటున్నావా? నీతో వాదు పెట్టుకోను! చెప్పు! ఒక్కమాట చెప్పు!...ఎందుకు తాగేవురా, నీ పాడె కట్ట...అను. నా ముఖాన తుపుక్కున ఊసేయ్. ముఖం తుడుచుకుంటూ వెళ్ళిపోతాను.'

కుశలయ్యకు కళ్ళు బైర్లు కమ్మాయి. చుట్టూవున్న ప్రతి వస్తువు అతని కంటికి చావు పుట్టుకల్లా, మంచిచెడ్డల్లా, పాపపుణ్యాల్లా జంటగా కనిపించసాగింది. గాంధీ ప్రతిమ కూడా రెండైంది. ఇద్దరు గాంధీలు!

కళ్ళు నులుముకున్నాడు కుశలయ్య. 'ఇదేమిటీ మాయ! రూపాయి బిళ్ళ బద్దలుగా చీలి బొమ్మా బొరుసూ పక్కన పక్కన నుంచున్నట్లు—రెండు రూపాలుగా నిలబడ్డావా బాపూ! మీలో ఎవరు గాంధీ? ఎవరు గాంధీ కాదు?'

ఆయనే మహాత్మా గాంధీ!

'మరి నువ్వో?'

నేను మహాత్మా బ్రాందీని!

'నువ్వు కూడా అచ్చంగా ఆయనలాగానే వున్నావే!'

ఆయన పేరు ఉచ్చరించే నాలుకలన్నీ పుణ్యతీర్థాలు కదా! కోటి తీర్థాలలో నేను స్నానం చేశానయ్యా! ఆ పుణ్యఫలితమే యిది!

'ఓ మహాత్మా! ఓ మహర్షీ!'

ఎందుకలా గజేంద్రుడిలా ఘీంకరిస్తావు? ఆయన మాట్లాడడు కుశలూ!

'ఎందుకు మాట్లాడడు? ఆయన నా దేవుడు!'

ఒకే దేవుణ్ణి ఎల్లకాలం పూజించాలని ఎక్కడుంది? ఈ దేశం ఎందరు దేవుళ్ళను పూజించలేదు?! హిందూమతంనుండి గాంధీమతందాకా ఎన్ని మతాలు పుచ్చుకోలేదు! ఇప్పుడు ఉచ్ఛస్థితిలో వున్నది, నా మతం! నేనే దేవుణ్ణి! గాంధీ స్థానాన్ని నేనే ఆక్రమించాను. ఆసేతు హిమాచల పర్యంతం ఇప్పుడు బ్రాందీ దండకాలే! బ్రాందీ స్తోత్రాలే! బ్రాందీ భజనలే! గాంధీ నీతో మాట్లాడడు బాబూ!

'లేదు! ఇందాకా నాతో మాట్లాడాడు గాంధీ!'

పిచ్చివాడా! నా మహిమలు నీకేం తెలుసు? గాంధీ చాటు నుంచీ మాట్లాడింది నేనేనయ్యా!

కుశలయ్య చెవులు మూసుకున్నాడు. చెరబట్టుకపోతున్న సైంధవుణ్ణి పరిపరి విధాల తిట్టిపోసే పాండవ పత్నికి మల్లే కేకలు వేశాడు. 'ఛీ! నీచుడా! నువ్వా? కళ్ళకు గంతకట్టి కోరిక చెల్లించుకునే కామరూపుడికిమల్లే—నా ఎదుట వేషం మార్చి నిలబడ్డావా? మాయావీ! నీ ముఖం చూస్తేనే పంచమహాపాతకాలు చుట్టుకుంటాయి. పో ఇక్కణ్ణుంచి! నీ పాపపు మాటలు నేను వినలేను. దుర్మార్గుడా! పోతావా, పోవా?'

వికటాట్టహాసాలు! కార్ఖానాలోని యంత్రాల చప్పుళ్ళ లాంటి నవ్వులు! ఊపిరాడనివ్వని ఉప్పెనలాంటినవ్వులు! రంగస్థలం మీద వినిపించే ఆత్మఘోష లాంటి నవ్వులు! అద్దాల మేడలోని ప్రతిబింబాలలాగా — లెక్కపెట్టలేనన్ని రూపాలు! చలికాలంలో

మంచుకురిసినట్లు, కుప్పపోసిన బజారుగుపత్తి గాలికెగిరినట్లు — చిత్రవిచిత్రంగా నాట్యాలు చేస్తున్నాయి.

'ఎవరు ? మీరందరూ ఎవరు ? ఎందుకలా నవ్వుతారు ?'

నేను విస్కీ ! నేను వైన్ ! నేను రం ! నేను బీర్ ! నేను జిన్ ! నేను సారాయి ! నేను కల్లు ! నేను స్పిరిట్ ! నేను ఆల్కహాల్ ! నేను టించర్ ! నేను నల్లుల మందు ! నేను ఎలుకల మందు ! నేను ఎండ్రిన్ ! నేనే ! అంతా నేనే ! అంతటా నేనే ! నా ముక్కోటి అంశలూ ముక్కోటి దేవుళ్ళు ! నన్ను ఎవరు ఏ పేరుతో స్మరించినా, ఏ రూపంతో పూజించినా నాకు యిష్టమే !

నవ్వులు ! బుడ్డీలన్నీ రాతినేల మీదపడి పగిలినట్లు !

కుశలయ్య కళ్ళు గట్టిగామూసుకున్నాడు. 'గాంధీమహాత్మా ! బుద్ధి గడ్డితిని నీ తోక తొక్కా నీరోజు. తప్పు తప్పు ! లెంపలేసుకుంటాను. నన్ను కాటేయకు. నన్నొదిలిపో ! ఫో !'

అతను మళ్ళీ కళ్ళు తెరచి చూశాడు. పులికొట్టి పారేసిపోయిన మృత గోవులా—గాంధీ ఒక్కడే — మాట్లాడకుండా నిలబడి వున్నాడు. సుడిగాలిలో రెపరెపలాడే చిత్తుకాగితంలా — కుశలయ్య గాంధీ ప్రతిమ చుట్టూ ప్రదక్షిణాలు చేయసాగాడు.

'అయిపోయింది బాపూ ! అంతా అయిపోయింది. చివరికి మిగిలిందేమిటి మాకు ? నీ పేరుతో యిక్కడొక ప్రతిమ ! నీ పేరుతో మాకొక పండుగ ! మా పండుగలన్నీ ఎలాంటివో తెలుసు కదా నీకు ? దేవుళ్ళకు మొక్కుతాం — దున్నల్ని నరుకుతాం. దైవత్వానికి నైవేద్యం పెడతాం, దానవత్వానికి మద్యంపోస్తాం ! దానవుణ్ణి ఆంబోతులా ఊళ్ళమీద వదిలేసి, మానవుడికి గోరీ కట్టేసి, దేవుడికి గుడి కడతాం ! గొడ్ల చావడిలోని దున్నలా, గంప క్రింది కోడిలా, కుక్కిమంచంలోని ముసలాడిలా, కుక్కిన పేనులా—దేవుడు గుడిలోనే వుంటాడు. ఎప్పుడో బుద్ధి పుట్టినప్పుడు—పెద్దపెళ్ళాం దగ్గరకు వెళ్ళే ముసలి రాజులా — దేవుడి దగ్గరకు మేం వెడతాం గానీ, మా దగ్గరికి దేవుణ్ణి రానివ్వం. మేము పెంచుకుంటున్న అల్సేషియన్ కుక్కలాగా — మేము చెప్పినట్టు వింటాడు దేవుడు. ఇవీ మా సంప్రదాయాల అర్థాలు, మా పండుగల పరమార్థాలు. వినాయకుణ్ణి భజించి ఉండ్రాళ్ళు భుజించినట్లు — నీ పేరున పండుగ జేసుకొన్నాం, ఈరోజు ! దేవాలయాల్లో, చర్చిల్లో, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిపాం. గీత పఠించాం. నీకు ప్రియమైన రామ్‌ధున్‌లు గానం చేశాం. భజనలూ, ఊరేగింపులూ జరిపాం. నూలు వడికాం. హరిజనవాడల్లో వీధులు శుభ్రపరిచాం. నీ స్మృతి చిహ్నంగా ప్రధాన వీధులకు నీ పేరు పెట్టాం. నీ బోధనలను ప్రచారం గావించాం. నీకు జోహార్లు సమర్పిస్తూ ఏకధాటిగా ప్రసంగించాం. పిల్లలకు మిఠాయిలు, కుష్ఠురోగులకు ఖద్దరు వస్త్రాలు పంచిపెట్టాం. బీదలకు అన్నదానం జరిపాం. మేము చుక్కేసుకుని, చికెన్ బిరియానీ తిన్నాం. జాతీయ సమైక్యతా ప్రతిజ్ఞ గైకొన్నాం. పక్షి జాతులన్నీ కలిసి బృందగానం చేసినట్లు 'జనగణమన' పాడాం. రేపటి మధ్యాహ్నం దాకా గుర్రుపెట్టి నిద్రపోతాం.

'అంతే ! నీ పండుగైపోయింది. ఏడాదిపొడుగునా మరెన్నో పండుగలున్నాయి మాకు. నీ ముఖంచూచే తీరిక మాకులేదు. నీ మాటలు వినే ఓపిక కూడా లేదు. అసలు అవి మాకు రుచిస్తే కదా ? పాత చింతకాయ పచ్చడి ! నూలుపోగు తగిలించుకుని, నేను బ్రాహ్మణ్ణంటూ పరువుగా అడుక్కునే శూద్రుడికి మల్లే—నీ పేరు చెప్పుకుని అవసరాలు గడుపుకుంటాం. పరీక్షకోసం పాఠాలు బట్టీ పెట్టే విద్యార్థిలాగా — నీ ఆశయాలను, ఆదర్శాలను నోటికి వేర్చుకుంటాం. వాటి ఆసరాతో — నాయకులు కావటానికీ, మహానాయకులు కావటానికీ అవకాశాలు వెతుక్కుంటాం. వేదికలెక్కి వాటిని సొంతం అప్పజెప్పేసి చప్పట్లు కొట్టించుకుంటాం, హరికథ చెప్పి అందె తొడిగించుకున్నట్లు ! అయితే పొరబాటున కూడా వాటిని ఆచరణలో పెట్టం. అలాంటి అడియాసలు యిక పెట్టుకోవద్దు.

పరస్పర సహకారంద్వారా గ్రామాలలో ఐకమత్యం పెంచుకోమన్నావు నువ్వు. పంచాయతీ ఎలెక్షన్ల మీది మోహంతో సుందోపసుందులమై, గ్రామాన్ని చీలదీసుకుని, తలలు పగలగొట్టుకుంటున్నాం మేము.

మాలలు మాత్రం మనుజులు కారా ? — అన్నావు నువ్వు. వాళ్ళను హరిజనులని పిలవమన్నావు. వాళ్ళను ఉద్ధరించమన్నావు. దేవతలను దివిజులనీ, సురులనీ, అమరులనీ అన్నట్లు — మాల మాదిగలకు మరొక పేరు హరిజనులని అనుకొన్నాము. పేరు మారింది, భావం మారలేదు. మేము వాళ్ళుగాపుట్టి, ఆ అధమత్వమెలాంటిదో అనుభవిస్తేగానీ పాపం ప్రక్షాళనం కానంతటి అత్యాచారాలను వాళ్ళమీద జరుపుతున్నాము.

'హిందూ ముస్లిం భాయీ భాయ్', అన్నావు నువ్వు. మతాతీత జీవనాన్ని నెరపుతూ, అన్నదమ్ముల్లా వుండమన్నావు. ఆ మతాలను సరిగ్గా అర్థం చేసుకోటానికైనా ప్రయత్నించటం లేదు మేము. మనిషి తర్వాత పుట్టిన మతాలివి. అజ్ఞానం, ఆలోచన — ఈ రెంటి మైథునంవల్ల జన్మించిన మతాలివి ! ఈ మతంపట్ల మాకున్న పిచ్చి వ్యామోహంతో, మూఢ విశ్వాసంతో మనుషులం వేరుపడిపోతున్నాం. మత పిశాచాల ప్రీత్యర్థం మారణహోమం సల్పుతున్నాం.

'తెల్లవాణ్ణికాస్త బల్లకట్టు మీదికెక్కించి, స్వయంవరానికి ముస్తాబు కావటం ఒక్కటేకాదు పరమావధి, స్వాతంత్ర్యానికి పరమార్థం ప్రజాస్వామ్యం కాదు, ప్రజాసామ్యం — అన్నావు. మా ముప్పైఏళ్ళ ప్రజాస్వామ్యం కలిమిలేముల మధ్య అఖాతాల్ని తొలిచేసింది. సామ్యవాదం మనుగడకు మేమిచ్చిన అవకాశాన్ని చూచి సిగ్గుపడటానికి మాలో చీమూ నెత్తురూ లేవు. కొత్తరాజును ఎన్నుకోమని మత్తేభానికి పూలదండ యిచ్చినట్లు — మనిషిని ఆర్థికంగా మెరుగుపరిచే అధికారాన్ని అదృష్ట దేవతలకు, మాంత్రిక—



3

తాంత్రిక శక్తులకు అప్పగించాం. ఇక చెప్పనేల? ప్రజాస్వామ్యం పరుగు పందెంలా తయారైంది. అక్రమం, అన్యాయం, అధర్మం, అవినీతి—మాకు ఆరాధ్యదైవాలైనాయి. అందుకోవటానికి అర్రులు చాస్తున్నాము. అందకపోతే చతికిలబడుతున్నాము. అందుకుంటున్న వాళ్ళను చూచి, అందలాలు దిగని వాళ్ళను చూచి ఓర్చుకోలేక పోతున్నాం. అందుకోజూస్తున్న వాళ్ళను అణగదొక్కేస్తున్నాం. సంఘర్షణ! దోపిడీలు, దొంగతనాలు, దొమ్మీలు, హత్యలు, అరాచకాలు! నువ్వు ప్రవచించిన పరమ సాత్త్వికసామ్యవాదం అనాకారమై మా చేతుల్లో గండ్రగొడ్డలిగా మారింది! పాలు తాగటం మానేసి యిప్పుడది పచ్చి నెత్తురు తాగుతోంది చూడు!

మద్య నిషేదమే సామాజిక రుగ్మతలకు పరమౌషధం అన్నావు. వెలయాలి మాటవిని సహధర్మచారిణిని వీధిలోకి గెంటేసినట్లు—వ్యామోహానికి బానిసలమై మద్యనిషేదాన్ని వెలివేసేశాం.

'అయ్యో, మహాత్మా! చివరికి దేవుడి స్థాయికి దింపేశాం నిన్ను! దేవుడంటే మాకు భయంలేదు. మృత్యువంటేనే భయం! నువ్వంటే మాకు గౌరవం లేదు. నువ్వు వెలివేసిన క్షుద్ర శక్తులంటేనే గౌరవం! పుట్టి చచ్చిన విచిత్ర శిశువును గాజు కుప్పెలో భద్రపరిచే ప్రదర్శనశాల యిది. నీ బిరుదు 'జాతిపిత'! అది గాజు కుప్పె! నువ్వొక ఎగ్జిబిట్! తాజ్‌మహల్‌లాగా మా జాతికి నువ్వొక ఆర్నమెంట్! హంగుకోసం అట్టిపెట్టిన శిధిల శిల్పంలా—నిన్ను శిలగాచేసి నాలుగు వీధులమధ్య నుంచోబెట్టాం. విగ్రహారాధకులమైన మాకు నీ విగ్రహం మాత్రమే కావలసొచ్చింది మహాత్మా! నీ ఆత్మ సౌందర్యమే మమ్మల్ని అలరించలేక పోయినప్పుడు — ఈ బాహ్యసౌందర్యం మాత్రం ఎందుకిక్కడ? కేవలం దర్శనానందానికే అయితే, యింతకంటే ఏ సినిమాతార బొమ్మనో యిక్కడ పెట్టుకోవచ్చుగదా? సినిమాతార శరీరంలోనైతే చూడదగినవన్నీవున్నాయి. అందం, ఆకర్షణ! రంగు, పొంగు! వంపు, సొంపు! లావు, లావణ్యం! నీలో ఏమున్నాయి మహాత్మా? బోడితల, బోసినవ్వు, ముడతలు పడిన చర్మం, కండలేని ఎముకలు, వంగిపోయిన నడుం, ముసలితనం, ఊతకర్ర... వెక్కిరించటానికి కాకపోతే, ఎందుకయ్యా నీ ప్రతిమ?...'

ఏడుపు వినిపించింది. ఊబిలోనుండి కదల్లేక, ఒలుచుకు తింటున్న రాబందుల్ని విదిలించుకోలేక 'ఈ...య్యా' అంటూ మూలిగే దున్న లాగా—ఆ ఏడుస్తున్న దెవరు?

కుశలయ్య వెనుదిరిగి చూశాడు.

బ్రాందీ దుకాణం ముందర ఒక అనాథ నిలబడి అడుక్కుంటోంది. ఆమె చంకలో పసివాడు. ఆ ఏడుపువాడిదే! చేసేపనులేమీ లేక చ్యూయింగ్ గమ్ నములుతూ కూర్చున్న ఆఫీసరులా—ఎండిపోయిన రొమ్ము నోటబెట్టుకుని నములుతున్నాడు. దవడలు నొప్పి పెట్టాయేమో—నమలడం మాని ఏడుస్తున్నాడు. కూటి మెతుకుకోసం


# ఆంధ్రగ్రంథమాల ప్రచురణలు

## పండితారాధ్య చరిత్ర

డాక్టరు తిమ్మావజ్ఝల కోదండరామయ్యగారు వ్రాసిన పీఠికతో అమ్మకానికి సిద్ధంగావుంది. వెల రు. 15-00 (పోస్టేజి అదనం)

## బసవ పురాణము

బైండుచేసిన రంగుల అట్టతో కీ. శే. కాశీనాథుని నాగేశ్వరరావుగారి 'ప్రస్తావన'తో కళాప్రపూర్ణ నిడుదవోలు వేంకటరావుగారి విపుల పీఠికతో అమ్మకానికి సిద్ధంగా ఉంది. వెల: రు. 7-50 (పోస్టేజి అదనం)

## భగవద్గీత

కీ. శే. కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు వ్రాసిన వ్యాఖ్యానముతో బైండుచేసి అమ్మకమునకు సిద్ధముగా నున్నది. వెల రు. 7-50

ఆంధ్రపత్రిక ఏజెంట్లద్వారా కూడా తెప్పించుకోవచ్చు. (పోస్టేజి అదనం)

........................ప్రతులకు........................

మేనేజరు,
ఆంధ్రపత్రిక, గాంధీనగర్, విజయవాడ-3

కుడితిలో చెయ్యివేసి కెలికే దరిద్రుడిలా—ఏడుపు మాని, మళ్లీ చన్ను నోటబెట్టుకున్నాడు. పాలు లేకపోతేమానె, జీవమైనా వుందా అందులో? బీటలు వారిపోయిన కరువు నేలలాంటి చన్ను!

అడుక్కుంటోంది! ఆడది అడుక్కుంటోంది! నా తల్లి లాంటి ఆడది! నా చెల్లిలాంటి ఆడది! మొగుడు చచ్చాడేమో—వదిలేసి పోయాడేమో—సాయపడమని లోకాన్ని చెయ్యి జాచిందేమో—సమయం చూచి లోకం ఆమె ఒంటిమీద చెయ్యి వేసిందేమో—బంగారు విలువ తెలియని వాడివద్దనుండి బంగారం కొనుక్కున్నట్లు, ఆమెనుండి కొనుక్కున్న ఆనందానికి పావలా డబ్బులిచ్చి బ్రతికి పొమ్మన్నదేమో—మగవాళ్ళ కక్కుర్తిని వ్యాపారంగా మలుచుకోవడం ఆమెకు చేతగాక పోయిందేమో—చెత్తకుండీలో పడిన ఎండుటాకులా, నమిలి పారేసిన చెరకుపిప్పిలా విసురుకొచ్చి పడింది! అన్నీ పోగొట్టుకుని, పోని మొండిప్రాణం వేపుకు తింటున్న పొట్ట కోసం—పేవ్‌మెంట్లమీదికీ, పాలబల్బుల క్రిందికీ వచ్చింది. చంటివాడి పాలకోసం — బ్రాందీ దుకాణం దగ్గర నిలబడి అడుక్కుంటోంది.

అయ్యలారా! అన్నలారా' ఆమెకేదైనా యివ్వండి! ఆమె మీకు చేతులెత్తి మొక్కుతుంది. ఆ జన్మాంతం మీకు ఋణపడి వుంటుంది. మీ ఋణం తీర్చుకోవటానికి ఆమెవద్ద ఏమీ లేదిప్పుడు. ఉన్నదంతా ఊడ్చుకుపోయింది. ప్రతిఫలాపేక్ష లేకుండా—మీకు తోచింది ఆమెకు దానం చెయ్యండి!

ఆమెను చూచి అసహ్యపడి దూరంగా తప్పుకుపోతున్నారందరూ! ఆమె వైపు ప్రక్క చూపులైనా చూడటం లేదెవ్వరూ! గుడ్లప్పగించి చూడటానికి, ఎంత సొమ్మయినా కుమ్మరించటానికి ఆమె ఎగ్జిబిషన్‌లోని నగ్నచిత్రం కాదుగదా? గుండెలు కరగటానికి, చేతి రుమాళ్ళతో కళ్ళొత్తుకోటానికీ—యిది సినిమా కాదుగదా! అయ్యో అనటానికి—ఈవిడేమన్నా వేషం వేసుకొచ్చిన సినిమా తారనా! కేవలం ఈమెకోసమే సినిమాతార స్వయంగా వచ్చి నిధి ప్రోగుజేస్తే, లక్షలు కురిపించరూ మీరు? కలిగిన ప్రభువులారా! లక్షలెందుకూ ఆమెకు? గుండె ఆగి చావటానికా? వద్దు! అంతటి మహాదాతృత్వం వద్దు! ఆ సినిమా తార రాలేదు. స్వయంగా ఈ అనాథ మిమ్మల్ని అడుక్కుంటోంది. తలా ఒక పదిపైసలిచ్చి, ఆ కుర్రాడి కాలే కడుపును చల్లార్చండి. వాడు **భారతమాత** పుత్రుడు!

కుశలయ్య బ్రాందీ దుకాణంవైపు నడిచాడు.

చేయి చాచాడు.

'అయ్యా! బాబూ! ధర్మప్రభువులారా!'

పర్సులోనుంచి నోటు లాగుతున్న వాడొకడు 'పో పో!' అన్నాడు.

'మాంధాతలారా! నాక్కాదు! నాకేం? దుంగలాగా వున్నాను. అటు చూడు! ఆమె ఎవరో బాగా చూడు! పైకి చూస్తూ కింద నుంచున్న మనిషి. ఆమె అలా పైకి చూస్తుంటే, పైనున్న మనం కూడా పైకి చూడకూడదు. కిందికి చూడాలి. అదే మానవత్వం! అడుక్కుంటోందామె! అడుక్కోటానికికూడా జంకుతూ, గడపదాటిరాని కుక్కలా నుంచుంది. సమానత్వంకోసం పోట్లాడటం లేదామె. సామ్యవాదాన్ని గురించి గొంతు చించుకోవటంలేదు. నువ్వు తిండిపోతువైనా, తిరుగుబోతువైనా ఆమె వద్దనదు. నువ్వు కారెక్కినా, విమానమెక్కినా ఆమె కాదనదు. ఆమె నోరు చచ్చిందని, నువ్విలా తాగడం మాత్రం ధర్మంకాదు. నీ ఆస్తీ పాస్తీ, ఇల్లూ వాకిలీ, డబ్బూ దస్కం ఆమెకు పంచిపెట్టవద్దు. తాగటం మానేసి, నీ తాగుడుకయ్యే ఖర్చు మాత్రం ఆమె కిచ్చెయ్. అదే కొండంతగా ఆమె తృప్తిపడిపోతుంది భారతీయులు నా అన్నదమ్ములంటూ మురిసిపోతుంది.

'ఇదెక్కడిపీడ! మన డబ్బు దానికిమ్మంటున్నాడేమిటే, పెద్ద హీరోలాగా!'

'మీ డబ్బులంటారా? ఆమాట అనకండి! ఆమె నోరు చేసుకుంటుంది. ఆమె వాదానికి దిగితే ధర్మదేవత ఆమె పక్కనే నుంచుంటుంది. మీరు కుడుస్తున్నది మీ డబ్బు; మీరు తొడుక్కుంటున్నది మీ డబ్బు; మీరు కప్పి వేసుకున్నది మీ డబ్బు; మీరు తాగుతున్నది మీ డబ్బా? అది మా డబ్బు! మా డబ్బుతో మీరు తాగేసి, మాకు కనీసం కూడైనాలేకుండా చేస్తున్నారు. మీడబ్బేదో మీరు వుంచుకుని, మా డబ్బు మాకిచ్చెయ్యండి — అంటుందామె. ఏం సమాధానం చెబుతారు?'

'ఏయ్! అద్దాలమీదపడకు! దూరంగా పో!' అంటూ అతన్ని రోడ్డుమీదికి నెట్టాడు దుకాణదారు.

'ఇవ్వరన్నమాట! సరే, మీ కర్మ! ఇప్పుడామె వూరుకుంటుంది. ఆమె చంకలో వున్నాడు చూశావా — కాబోయే మహారాజులుంగాడు — వాడూరుకోడు రేపు. వాడూరుకున్నా, వాడి కొడుకులూ, వాడి మనవళ్ళూ వూరుకోరు. ఒకడి వీపుమీద ఒకడెక్కి గొల్లపిల్లలు ఉట్టిదించుకున్నట్టుగా—వాళ్ళు మీ మేడలెక్కివచ్చి, వాళ్ళ డబ్బు వాళ్ళు తీసుకుంటారు. ఇది మీకు హెచ్చరిక!...అంత దూరం ఎందుకు? మీరు మహావైభవంగా బ్రతకండి, వాళ్ళనూ చల్లగా బ్రతకనివ్వండి! నాదీ భారతదేశమే అనవయ్యా! **భారత** దేశమంతా నాదే — అనకు!

బిచ్చగత్తె వెరగుపడిపోయి చూస్తూ వుంది. కుశలయ్య ఆమెను సమీపించాడు. జేబులో చెయ్యివేసి రూపాయినోటు పైకి తీశాడు.

'అమ్మా, భారతమాతా! అలా కృంగిపోకు! రేపు నీ బిడ్డ గొప్పవాడౌతాడు. కంపు కొడుతున్న ఈ చీర విడిచేయమని, కొత్త చీర కొనిపెడతాడు నీకు! ఆశలు చంపుకోకు! ఇదిగో రూపాయి! దీనిమీద గాంధీ మొహరు వుంది చూశావా? ఇది నీదే! ఈగాంధీ నీకే! వెళ్ళు! కడుపునిండా కూడుతిను! నీ బిడ్డకు పొట్టనిండా పాలిచ్చి జోకొట్టు! వాడు రేపు నిద్ర లేస్తాడు. ఇందా రూపాయి!'

వాకిట్లోకీ వీధిలోకీ తప్పటడుగులువేస్తూ నడిచే పసివాడికి మల్లే — ఏరు దాటాలనుకుంటున్న కుక్కపిల్లకు మల్లే — గాంధీ

విగ్రహం దగ్గరికీ, నాలుగు రోడ్లమీదికీ తిరుగుతున్నాడు కుశలయ్య. అతని చుట్టూ ఏం జరిగిందో అతనికి తెలియలేదు.

సినిమాలు వదిలారు. రోడ్లన్నీ మగత నిద్రనుండి మేల్కొని సందడి చేయసాగాయి. కుశలయ్య చుటూ నాలుగు రోడ్లమీద కార్లు, జీపులు గూడ్సురైళ్ళకుమల్లే బారులుతీరి నిలబడిపోయాయి. తెరమీద చూచిన నర్తకిని తన మేడ పక్కన సందులో సుందరిలో ఊహించుకుంటూ కారులో కూర్చున్న షావుకారు కళ్ళురిమి, కారు అద్దాలలో నుండి కుశలయ్యమీద నిప్పులు కురిపించాడు. నాయికా నాయకుల శృంగార చేష్టలతో గుండె కుంపటికాగా, చల్లార్చుకోవటానికి వేగిరపడుతూ జీపులో కూర్చున్న ఆఫీసరుగారి కొత్తపెళ్ళాం 'న్యూసెన్స్' అంటూ అందంగా కళ్ళు చికిలించింది. బలిచక్రవర్తి వంచిన కమండలంలోని నీళ్ళకుమల్లే ట్రాఫిక్ బంద్ అయిపోయింది.

ధార సాఫీగా పడటానికి వామనుడే కావాలి! దర్భ తీసుకున్నాడు వామనుడు. కమండలం మూతిలో పొడిచాడు. అడ్డంగా కూర్చున్న శుక్రాచార్యులవారికి చావు తప్పి కన్ను లొట్టపోయింది. అడ్డు తొలగి ధార జరజరా కారింది.

'ఎందుకు నన్నిలా లాగుతావ్? వొదులూ!' అన్నాడు కుశలయ్య.

'నడూ!'

'ఎక్కడికి?'

కళ్ళు చికిలించి చూశాడు కుశలయ్య.

పోలీసు!

'ఓహో! అక్కడికా!'

పోలీసు అతన్ని నడిపించుకు పోతున్నాడు.

'నన్నెందుకు పట్టుకుపోతున్నావ్? నేనేం తప్పు చేశానని?'

'నీవల్ల ట్రాఫిక్‌కు అవరోధం కలిగిందోయ్ వాజమ్మా! ఎంత గందరగోళం జరిగిపోయిందో తెలుసా? బళ్ళన్నీ ఒక దాంతో ఒకటి గుద్దుకుని గల్లంతై వుంటే, ఎంత ఘోరంగా వుండేదో ఆలోచించావా? కొట్లో కూచుందువుగానీ, పద!'

'ఓహో, అదా సంగతి!' అంటూ విస్మయం ప్రకటించాడు కుశలయ్య. 'అన్నా! నన్నలా నెట్టుకుపోకు! నేనే వస్తున్నానుగా?'

మూడేళ్ళ కుర్రాడెక్కిన మూడు చక్రాల సైకిలులా పోలీసు వెంట నడుస్తూ, వున్నట్టుండి నవ్వాడతను. 'కానిస్టేబులూ! అసలు నీకు మతి వుందా? అహఁ – వుందా అంటా!'

పోలీసు ఉడుక్కున్నాడు. 'ఏం? ఎందుకు లేదూ?'

'నేను తాగాను.'

'తెలుస్తూనే వుంది.'

'నువ్వెప్పుడూ తాగలేదా కానిస్టేబులూ?'

పోలీసు పలుకలేదు.

'పోనీ, తాగటం తప్పంటావా?'

'మహరాజుగా తాగు! నాకేం?'

'మరైతే నేను తాగాను గదా, నన్నెందుకు పట్టుకున్నావు?'

'తాగినందుక్కాదు. బళ్ళకడ్డంపడి, బొంగరాలు తిరిగినందుకు!'

'అదీ! అందుకే నీకు మతి లేదన్నాను నేను తాగాలనుకున్నప్పుడు పట్టుకోలేదు. తాగబోతున్నప్పుడు పట్టుకోలేదు. తాగుతున్నప్పుడు పట్టుకోలేదు. తాగింతర్వాత పట్టుకున్నావు. తాగినవాడికి తప్పొప్పులు తెలుస్తాయా కానిస్టేబులూ? నిజంగా బళ్ళన్నీ బోల్తాపడ్డాయే అనుకో; నన్నిప్పుడు పట్టుకుని ఏం బావుకుంటావు నువ్వు? తాగబోతున్నప్పుడే ఎందుకు పట్టుకోలేదు?'

'మహరాజుగా తాగు! నాకేం?'

'తప్పదియ్యా! యింత దూరం నడిచి మళ్ళీ మొదటికే వస్తావే!'

కుశలయ్య మౌనం వహించాడు. పోలీసు మౌనంగానే వున్నాడు

'ఇంకా ఎంత దూరం కానిస్టేబులూ?'

పోలీసు ఉలికిపడ్డాడు. తలెత్తి ముందరికి చూశాడు. వెనక్కు తిరిగి చూశాడు. 'భలేవాడివే! చిక్కుప్రశ్నవేసి, స్టేషను దాటించేశావు!'

ఏమిచేయాలో తోచకుండా, పిక్కలమీద లాటీక్రరతాటిస్తూ, చేతులువెనక్కు కట్టుకున్నాడు. 'సరే! ఇక్కడ కూర్చో!' అన్నాడు.

కుశలయ్య కూర్చున్నాడు. 'ఇప్పుడెక్కడున్నాన్నేను?' అంటూ గుడ్లు వెళ్ళబెట్టి చుట్టూ చూశాడు. నల్లటి రోడ్డు. రోడ్డు ప్రక్కన నిలబడ్డ వీధిదీపాలు. మైలురాళ్ళకుమల్లే దూరదూరంగా వున్న భవనాలు. భవనాల చుట్టూ చిమ్మచీకట్లు చచ్చినవాడి గుండెలాగా – చుట్టూ నిశ్శబ్దం! రోడ్డువార చెట్లు. చెట్టుక్రింద తాను. ఆకాశానికి పెరిగిన వామనావతారంలా–తన ఎదుట పోలీసు!

'చూడబోతే నువ్వు మంచివాడిలా వున్నావు. నీపేరేమన్నా?' అన్నాడు పోలీసు.

'కుశలయ్య'

'ఈ వూరు కాదా?'

'మా వూరు!'

'నా చేతుల్లో పడ్డావుగనుకసరిపోయింది. మరొకళ్ళయివుంటే, ఈ వూరూ గాకుండా, మీ వూరూ గాకుండా, మరో వూరికి పంపించి వుందురు నిన్ను!...ఇక్కడ నీకేమీ భయంలేదు కుశలన్నా! ఒళ్ళు నయమయ్యేదాకా యిక్కడే కూచుని, తరవాత మీ వూరెళ్ళిపో! ఏం?'

కుశలయ్య అతనివైపు సాదరంగా చూశాడు. 'కానిస్టేబులూ! ఇంకే ఉద్యోగమూ దొరకలేదా నీకు? చిన్నప్పుడు ఢిల్లీకి బయలుదేరాను, గాంధీని చూద్దామని! అప్పుడు కూడా యిలాగే ఓ పోలీసాయన నన్ను భద్రంగా యిల్లు చేర్చాడు. ఇప్పుడు నువ్వు! పోలీసువాళ్ళను నమ్మకూడదంటారు. ఎంత అన్యాయం!'

'గిట్టని వాళ్ళంతా అలాగే అంటారులే కుశలన్నా! నీలాంటి మంచివాళ్ళు కొందరున్నారు గనుకనే, మేమీ ఉద్యోగంలో వుండ గలుగు తున్నాం!...ఇక నన్ను పొమ్మంటావా కుశలన్నా?'

'ఎక్కడికి? ఇంటికా?'

'ఏం ఇల్లో పోనిద్దూ! ఇల్లా అది? నరకం! జోరీగలాంటి పెళ్ళాం. జలగల్లాంటి పిల్లలు. చాలీచాలని జీతం. ఊరినిండా అప్పులు. కడుపులో కొండంత దిగులు. కళ్ళు మూసుకుంటే పీడ కలలు. ముక్కేసుకోందే నిద్రరాదు. ముక్కేసుకుందామంటే చిల్లర లేదు. చాలీ చాలని జీతం! ఊరినిండా అప్పులు!'

'అయ్యో! నాకు ముందే తెలియకపోయిందే! హోటలు కుర్రాడికిచ్చిన బుడ్డీ నీకిచ్చి వుందును. పోతే పోయిందిగానీ, ఇదిగో కానిస్టేబులూ! నా జేబులో డబ్బులున్నాయి. మా వూరికి దూరం ఒక రూపాయి! అదిమాత్రం అట్టేవుంచేసి—ఏది? గాంధీనోటు!... మిగతాది నువ్వు తీసుకో!'

'నువ్వు నన్ను తప్పుగా అర్థంచేసుకున్నావల్లేవుంది కుశలన్నా! నేను దొంగననుకుంటున్నావా? జేబులో చెయ్యి దోపడమంటే దొంగ తనం కదూ? కంచే చేనుమేస్తే ఎలా? ఇస్తే పుచ్చుకోవచ్చు! తప్పు లేదు!'

జేబులోవున్న డబ్బంతా వూడ్చి, 'ఇందా!' అన్నాడు కుశ లయ్య. పోలీసు డబ్బు పుచ్చుకుంటూ 'నిన్ను ఇబ్బంది పెట్టేస్తు న్నాను కుశలన్నా!' అన్నాడు.

'అమ్మమ్మ! మళ్ళీ అంతమాటెందుకు?' అంటూ దోసిలి పట్టాడు కుశలయ్య. ఆ దోసిట్లో రూపాయినోటు పెట్టాడు పోలీసు. 'గాంధీ నోటేమో సరిగ్గా చూసుకో!' అన్నాడు.

కుశలయ్య చెయ్యి పైకెత్తి చిరంజీవిగా వుండు!' అన్నాడు.

'నీ నోటి చలవ!' అంటూ వచ్చిన దారినే వెనక్కు మర లాడు పోలీసు. క్రిందికి వాలిన రోడ్డుమీద దొర్లిపోయే రూపాయి బిళ్ళలాగా నడిచి వెళ్లిపోయాడు.

చీకట్లోనుంచి వీస్తున్న గాలి టించర్లాగా చల్లగా వుంది. నల్లని ఆకాశంలో గుడారాలు వేసిన మబ్బులు — తాగేసి గుర్రు కొడుతున్న వాడిలా గొణుక్కుంటున్నాయి. బ్రాందీ దుకాణంమీద పడి ప్రతిఫలించే కారులైట్లకు మల్లే — దిక్కుల చివర గ్రుడ్డిగా మెరుపుమెరిసింది.

దూరంగా—గాంధీవీపు కనిపిస్తోంది. గాంధీ వెళ్ళిపోతున్నాడు. త్రాగుబోతుల సభలో ప్రసంగించి శృంగభంగం పొందిన దైవాం శలా వెళ్ళిపోతున్నాడు.

ఉన్నట్లుండి రోడ్డుమీద 'ఢాం' అంటూ పెద్ద చప్పు డైంది. నెలాఖరున రానున్న దీపావళికి—సీమటపాకాయ పేల్చి స్వాగతం పలికాడు ఓ కుర్రాడు. ఆ చప్పుడు విని అదిరిపడ్డాడు కుశలయ్య.

ఒక్క నిమిషంపాటు అతని శ్వాస స్తంభించిపోయింది.

పిస్తోలు!

తెల్లని ఖద్దరు!

ఎర్రటి నెత్తురు!

రాం! రాం!! రాం!!!

కుశలయ్య గొంతులోంచి సన్నటి ఏడుపు బయలుదేరింది— నెత్తుటి చారలాగా! పిల్లకాలవే మహానదియైనట్లు ఆ ఏడుపు క్రమంగా పెద్దదైంది. బిగ్గరగా ఏడుస్తున్నాడతను ఆకాశంలోని నల్లమబ్బులు జడుసుకుని పారిపోయేటట్లుగా—వెక్కిళ్ళుపెట్టి ఏడు స్తున్నాడు.

కూతవేటు దూరంలోవున్న టీ కొట్టులోనుండి ఇద్దరు మనుష్యులు లేచివచ్చారు. మరోవైపున వారధిమీద కూర్చుని మాట్లాడుకుంటున్న వాళ్ళిద్దరు కదిలివచ్చారు. దారినపోతున్న మరో యిద్దరు నిలబడిపోయారు. అందరూ కుశలయ్యచుట్టూ మూగారు.

'ఏమైంది?' అని అడిగాడొకడు.

'గాంధీని చంపేస్తున్నారు!' అంటూ భోరుమన్నాడు కుశలయ్య.

'ఎవరు ?'

'ఎవరని చెప్పను? ఎవర్ని చూపించను? ఒక్కడా గాడ్సే?'

'గాంధీ ఈ రోజేకదా పుట్టాడు? ఈ రోజే ఎలాపోతాడు? అక్టోబరు రెండుకదా ఈరోజు!'

'కాదు! ఈరోజు జనవరి ముప్పై! ఈ తరమే జనవరి ముప్పై! భవిష్యత్తంతా జనవరి ముప్పై!'

అతని రోదనకు కారణమేమిటో తెలుసుకోగలిగామన్న తృప్తి వాళ్ళ పెదవులమీద హాసాన్ని చిందించింది. త్రాగుబోతును అనున యించే విధానాన్నే వాళ్ళు ప్రయోగించారు.

'చంపేస్తున్నారంటూ కంగారు పడిపోతావెందుకూ? పోలీసు లున్నారుగా! పట్టుకుంటారులే! నువ్వు నిద్రపోరాదూ?'

'పోలీసులా!' అన్నాడు కుశలయ్య నిరాశగా. 'మీరెప్పుడూ చదరంగం ఆడలేదా? పోనీ, ఎవరైనా ఆడుతుంటే చూడలేదా? చదరంగపు గళ్ళలోని పావులు ఏం చేయగలవు? ఎటు కదిలిస్తే అటు కదులుతాయి. ఎక్కడపెడితే అక్కడుంటాయి. పోలీసులు మాత్రం ఏం చేయగలరు పాపం, చూస్తూ వూరుకోవటం తప్పితే!'

ఆ పిదప కుశలయ్య ఎవరితోనూ మాట్లాడలేదు. కళ్ళు మూసుకుని చెట్టు బోదెకు చేరగిలబడ్డాడు.

మరికొంత సేపటికి తలకొంచెంగా పైకెత్తి 'ఎప్పుడు తెల్లారుతుంది?' అని అడిగాడు.

అయితే, ఆ ప్రశ్నకు బదులు చెప్పటానికి అక్కడెవ్వరూలేరు.